

**శతాబ్దాలు గడిచినా, తరాలు మారినా, మానవ వికాస పరిణామం ఎంత జరిగినా పురుషులతో ఎన్ని సున్నిత భావోద్వేగ సంబంధాలు, అనుభూతులు ఏర్పడ్డా ఇంకా చాలా సందర్భాల్లో స్త్రీ సొంత అస్తిత్వం లేని పంచుకోదగ్గ వస్తువుగా పరిగణింపబడడం విచారకరం.**

డా॥ కె.వి. రమణరావు

# 11 అప్పగింతలు

చారి పి.ఎస్.





ఎప్పట్నించో రమ్మంటా వున్నారని, శనాదివారాలు, పండగ కలిసొస్తే, శుక్రవారం రాత్రి తిరుపతిలో బయల్దేరి పోరుమావిళ్లలో బస్సుమారి తెల్లారేసరికి మా చిన్నాన్న మల్లికార్జునయ్య ఊరెళ్లాను. అదొక ప్రశాంత మైన చిన్న పల్లెటూరు, మెట్ట ప్రాంతం, చెదురు మదురుగా చెట్లు. ఊరికి పడమరగా చెరువు, దూరంగా దిగంతానికి గోడ కట్టినట్టు నల్లమల కొండల వరస.

ఆదివారం మధ్యాహ్నం పండగభోజనాలయ్యాక హాల్లో వీధి తలుపు దగ్గర నవారు మంచం వాల్చుకొని పడుకున్నాను. ముందు వసారాలో అరుగుమీద కూర్చొని కాగితాలు చూసుకుంటున్నాడు మా చిన్నాన్న. సావిత్రమ్మ పిన్ని వెనకాల వంటింట్లో సర్దుకొనే పనిలో వుంది.

నిద్రపోదామనుకుంటూండగా వంటింట్లో మా పిన్నితో ఎవరో మాట్లాడేది వినపడింది. పక్కకు ఒత్తిగిలి వంటింటివైపు చూశాను. సన్నగా పొడుగ్గా వున్న యిరవైయేళ్ల అమ్మాయి.

తలస్నానం చేసిన జుట్టుతో నవ్వుతూ చలాకీగా వుంది. కట్టుకున్న ముదురు నారింజరంగు కొత్తచీర మెరుస్తాంది.

"మల్లయ్యన్న సాయంత్రం యింటికాడ వుంటాడా అని మా అన్నలు కనుక్కోని రమ్మన్నారు సావిత్రక్కా, అందరొచ్చి మాట్లాడేదుం దంట," అంటావుందా అమ్మాయి.

"నీకు లగ్నమేమన్నా కుదిరిందేమే, మీ పెద్దొదిన వరమ్మన్నా చెప్పలేదే. లేకుంటే అందరూ కట్టగట్టుకోని యెందుకొస్తారూ. నువ్వైనా చెప్పచ్చుగదా అలివేలూ, నాదగ్గిరగూడా సిగ్గా?" అంది పిన్ని ఆ పిల్ల బుగ్గ గిల్లి.

"అట్లాటిదేం లేదక్కా, పండక్కని నిన్న రాత్రే మా నడిపన్నా, చిన్నన్నా, వొదినలూ వచ్చినారు. మల్లయ్యన్నను చూసిపోదామని అనుకుంటా, అంతే," అంది అలివేలు సిగ్గుపడి, గోడకానుకొని నిలబడి తలొంచుకొని కాలు నేలమీద రాస్తా.

"యేం సిగ్గే ముగ్గురన్నల ముద్దుల చెల్లెలా. మీ మల్లయ్యన్న యీ సాయంత్రంమెక్కడికీబోడు అందర్నీ రమ్మని చెప్పు," అని నేను తిరుపతి నుంచి తెచ్చిన స్వీట్లు నాలుగు అలివేలు చేతిలో పెట్టింది పిన్ని. ఆ పిల్ల పెరటి తలుపులోంచి తుర్రుమని వెళ్తావుంటే, "నేను పిల్లోణ్ణి చూసి వొప్పుకోందే నీ పెండ్లి జరగనీనని మీ అన్నలకు చెప్పు," అని వెనకాల్నుంచి అరిచింది పిన్ని.

''యెవరో వచ్చినట్టుందే'' అన్నాను మంచంమీద లేచి కూర్చొని.

''ఆ పిల్లా? అలివేలనీ, సుబ్బారాయుడి చెల్లెలు. ముగ్గురన్నదమ్ముల తరువాత యీమే. ముందు అందరూ యిక్కడే వుమ్మడిగా వుండి సేద్యం జేసుకునేవాళ్లు. చెరువు కింద దిగువకు ఐదెకరాల మడి, మిట్టమీద రెండెకరాల చేను. యేం సేద్యంలే. యీమధ్య అన్నీ అవస్తలే పాపం,'' అంది పిన్ని హాల్లోకొచ్చి.

''యిప్పుడు కలిసిలేరా,'' అడిగాను.

''రెండేండ్ల కిందట విడిపోయినారు. నడిపన్న నాగన్న కల్సపాడు దగ్గర అత్త గారింటి కెళ్లిపోయినాడు. మూడో అన్న మోహను బ్రంహంగారి మఠానికిపోయి టీచరుగా చేరినాడు. వాళ్లింట్లో అతనొక్కడే బియ్యేదాకా చదువుకున్నాడు. నెల కిందటే భూములు, యిల్లు, దొడ్డి అన్నీ భాగపరిష్కారాలు చేయించుకోని నాగన్న, మోహనూ వాళ్ల భూమి అమ్ముకున్నారు. నిన్న రిజిస్ట్రేషన్ అయిందన్నారు. అక్కణ్ణుంచి రాత్రి యిక్కడికొచ్చినట్టున్నారు,'' చెప్పింది పిన్ని.

''యీ పిల్లకు పెండ్లి కుదిరిందేమో అన్నావు,'' అన్నాను.

''నేననుకుంటావున్నా. మూడేండ్లనించి మంచి సమ్మంధం కోసం చూస్తా వున్నారు. నీకు పెండ్లైపోయిందిగాని లేకుంటే నిన్నాపిల్లకు అడిగుండేదాన్ని. మీపట్నం వాళ్లు వూహించుకొనే ఫ్యాషన్ అందచందాలుండవుగాని మంచిపిల్ల. ప్రేమగా చూసుకునే ముగ్గురన్నలున్నారు,'' అంది పిన్ని నవ్వి లోపలికెళ్తూ.

* * *

మా చిన్నాన్న మల్లికార్జునయ్య దగ్గర్లో జెడ్పి స్కూల్లో టీచరు. ఊళ్లో ఆయన దొక్కటే కాంక్రీటు మిద్దె, ఊరిచివర ఇల్లు. మిగతా వాటిల్లో కొన్ని మట్టి మిద్దెలు, తక్కినవి కొట్టాలు. పెద్దమనిషిగా మంచి పేరు. భూములు, వ్యవహారాల్లోనేకాక ఇంటి సమస్యల పంచాయతిక్కూడా ఆయన దగ్గరికే వస్తూంటారు ఊళ్లోవాళ్లు.

నేను కళ్లు మూసుకుని నిద్రలోకి జారిపోయాను.

సగంనిద్రలో వుండగా వసారాలో మనుషుల అలికిడి, మాటల శబ్దం వినపడి నాకు మెలుకువ వచ్చింది. మంచంమీదే బోర్లా తిరిగి వసారాలోకి చూశాను.

అలివేలు కనబడింది. ఆమెతోసహా మొత్తం ఏడుగురు మనుషులు వసారాలో అప్పుడే కూర్చుంటున్నారు. వాళ్లు అలివేలు అన్నలు, వదినలుగా అర్థమైంది. అన్నదమ్ములు ముగ్గురూ దూరదూరంగా కూర్చున్నారు. వాళ్ల భార్యలు భర్తల వెనగ్గా సర్దుకున్నారు. అలివేలు వీళ్లందరికీ పెడగా ఒక మూలగా మోకాళ్ల మీద గడ్డం ఆనించి కూర్చుంది.

మడతలు లొంగని పండగ చీర, పెద్ద బొట్టు, చిరునవ్వుతో వెడల్పుగా సాగిన పల్చటి నోరు. మనసులో నిల్చిపోయే అమాయకమైన కోలమొహం. మెరుస్తున్న పెద్ద కళ్లు, బుగ్గలు సంతోషాన్ని విరజిమ్ముతున్నాయి.

వయసునుబట్టి ముగ్గురన్నదమ్ములూ ఎవరు ఎవరో నాకు తెలుస్తోంది. ప్యాంటు, షర్టు వేసుకొని, చిన్నగా కనిపిస్తున్నతను మోహన్ అనుకున్నాను. పెద్దన్న సుబ్బరాయుడు, రెండో అన్న నాగయ్య అని గుర్తొచ్చింది.

వాళ్ల ఉమ్మడిగా వున్న కాలంనాటి మంచి సంగతులు గుర్తుచేస్తూ నాగయ్యను, మోహన్‌ను, 'ఇప్పుడెలా వున్నారని,' అడిగాడు చిన్నాన్న.

''యేం బాగులే మల్లన్నా. యేటివార వూళ్లో వుండామనేగాని యవసాయం దైవాదీనమే. ముందు మాదిరి యేర్లు యాడ పార్తాండాయ్. సచ్చి బతికి మూణ్ణెల్లు తడిగా వుంటాయ్. మల్లా కరెంటును నమ్ముకోవాల్సిందే. ఆడ యిల్లూ, బూములుంటే మాత్రం అవి నావిగాదుగా. యిల్లటం బోయినోడు ఆసామికాడుగా,'' అన్నాడు నాగయ్య నిర్లిప్తంగా నవ్వి.

మోహన్ తరపున అతని భార్య, ''మా పరిస్తితీ అంతకంటే హీనం. యీనకు ప్రైవేటు స్కూల్లో వుద్యోగం. చేయించుకునేది గంపెడు చాకిరి, యిదిలిచ్చేది నాలుగు రూకలు. దాంట్లోనే యింటి బాడిగ, పిల్లోల్ల ఫీజులు, తిండి, గుడ్డా అన్నీ. మఠంలో గుడి వుండేదాన అన్నీ పిరియమే. యేదో ఆడికాడికి యీడుస్తా వున్నాం,'' అంది.

మా చిన్నాన్న సుబ్బరాయుడి వైపు తిరిగి, ''పండక్కు కల్సిన అన్నదమ్ములంతా మర్చిపోకుండా కుటుంబాల్తోసహా మాయింటికొచ్చినారు, సంతోషం. మీ ముద్దుల చెల్లెలు అలివేలు గూడా వచ్చింది. నిన్న రిజిస్ట్రేషన్ సక్రమంగా ఐపోయిందని చెప్పిరి. శ్రీశైలం కొండకుబోయే మొక్కేమన్నా పెట్టుకున్నారా?'' పిన్ని ఇచ్చిన కాఫీని తాగబోతూ అడిగాడు చిన్నాన్న.

''నీకెంతసేపూ ప్రయాణాల చింతే, ఆ పిల్లకేమన్నా పెండ్లి సంబంధం కుదిరిందేమో,'' నవ్వుతూ చురక అంటించి లోపలికెళ్లింది పిన్ని. అలివేలు సిగ్గుపడి తలదించుకుంది.

సాయంకాలం నాలుగు దాటింది. గాలిలో వేరుసెనక్కాయల పచ్చివాసన వస్తోంది. ఎండినచెరువు మొరవవాగుమీద ఎగురుతూ ఉత్తీత అరుస్తోంది. వాగు ఇసకలో ఆడుకుంటున్న ఊరి పిల్లలగోల లీలగా వినిపిస్తోంది. అందరూ గంభీరంగా ఉండడం చూసిన చిన్నాన్న, ''యేం సుబ్బరాయుడూ, అపురూపంగా చూసుకునే చెల్లెలికి పెండ్లి చేసి బయటోళ్లకు అప్పగింతలు పెట్టాల్సొస్తాందని దిగులుగా వున్నారా, అది లోకంలో జరిగేదేగదా,'' అన్నాడు.

సుబ్బరాయుడేమీ మాట్లాడలేదు, తలదించుకుని కూర్చున్నాడు.

''ఆయమ్మి పసిబిడ్డప్పుడే మా నాయన కాలమైపాయె. అప్పట్నుంచీ ఆ యమ్మికి ఆ గవనమే లేకండా యీ చేతల్లో పెంచినామయ్యా,'' అన్నాడు నాగయ్య.

''మేము దూరంగా వున్నామన్న మాటేగానీ, 'యేమ్మే యెట్లున్నావ్,' అని రోజుకొక తూరైనా పోన్లో పలకరించందే మాకు పొద్దుబోదు మల్లన్నా. ఆయమ్మిగూడా మోహనన్నా అని కలవరిస్తానే వుంటుంది,'' అన్నను బలపరిచాడు మోహన్.

‘‘బాగ సూసుకోకుండా యెట్లుంటామయ్యా? ఆయమ్మి యేమన్నా పరాయిదా, మా తోడబుట్టిందేగదా,’’ అన్నాడు సుబ్బరాయుడు నిర్లిప్తంగా.

సంభాషణ ఎటుపోతోందో చిన్నాన్నకు అంతు చిక్కినట్టులేదు.

‘‘అదిసరే, అలివేలుకు సంబంధం ఖరారైందా, పిల్లోడు యెక్కడోడు,’’ అనడిగాడు.

‘‘సంబందాలు సూస్తానే వుండాం. యింగా యాడా కుదర్లేదు. యిప్పుడు మేమొచ్చింది ఆమాట గురించి గాదు,’’ చిన్నగా చెప్పి తలొంచుకున్నాడు సుబ్బరాయుడు.

‘‘యిషయం సరిగ్గా చెప్పొచ్చుగదా. మనం యింత దూరమెందుకొచ్చినట్టు. తలా వొకరకం మాట్లాడతారేందీ,’’ అందరివంకా చూస్తూ చెప్పింది సుబ్బరాయుడి భార్య.

‘‘పోనీ అదేందో నువ్వు చెప్పు వరమ్మా,’’ అన్నాడు చిన్నాన్న.

వాడిపోయిన వాళ్ల మొహాలు చూస్తే వాళ్లేదో బరువైన విషయం మీదే పంచాయతికి వచ్చినట్టున్నారని అనిపించింది. పిన్నివొచ్చి అందరికీ పండగ మిఠాయిలు ఇచ్చి వెళ్లింది. వాటినెవరూ ముట్టుకోలేదు.

‘‘నీకు తెలీందేముంది మల్లయ్యా... యిడిపోక ముందు వుమ్మడి బూమీమ్మీద నాలుగ్గింజలు కళ్లజూస్తాంటిమి. పంచుకున్నాక గెట్టిగా మాకు రెండెకరాలు రాకపాయె. రాన్రాను యీ వూళ్లో సేద్యం కనాకష్టంగా మారె. యీ మాయదారి వానల్తో నాట్లకాలం దాటిపొయ్యేదాంకా చెరువులో నీటిజాడ కనపడకపాయె. సూస్తాండంగానే అన్నీ పిరియమైపాయె. బ్రెమ్మంగారుగూడా రాయలేదు, జరుగుబాటుకాక మొగుడుండంగానే ఆడోల్లు తాలిబొట్టమ్ముకొనే కాలమొచ్చె. పిల్లోల్లు పెద్దయ్యేకొద్దీ మనిసికి మనిసి బరువాయె. ముగ్గుర్లేకి మా పరిస్తితే హీనంగా వుండాది. అలివేలు బరువంతా మా వొక్కర్నే మొయ్యమనేది న్యాయమంటావా నువ్వే జెప్పు,’’ చెప్పలేక చెప్పింది వరమ్మ.

‘‘బొరువు వొక్కళ్లు మోసేదేముండాది. ఆ యమ్మి బూమిలో వొచ్చే ఆదాయం వుండాదిగదా,’’ గొణిగింది నాగయ్య భార్య.

‘‘అట్ల మాట్లాడతావేంది రత్నా. చెరువు కింది బూములకే గెతిలేదు, యింగ యీ యమ్మి మిట్టబూముల్లో వొచ్చేదేముంది. కర్సులే మిగుల్తాండాయి. మీమాదిర్తో మేమేమన్నా యింగొకరింట్లో దర్జాగా వున్నామా, వుద్యోగాలు చేస్తాన్నామా,’’ బదులిచ్చింది వరమ్మ, వాళ్లిద్దరూ కొంచెం మంచి స్థితిలో ఉన్నారని గుర్తుచేస్తూ.

‘‘యీ బీటిమాటలన్నీ యాల. వచ్చిన పనేందో జూసుకోకుండా,’’ విసుక్కున్నాడు సుబ్బరాయుడు. అలివేలు మొహంలో చిరునవ్వు మాయమైంది. జరుగుతున్నదేమీ అర్థంకానట్టుగా ఒక్కసారి అందరివైపూ చూసి మళ్లీ తల దించుకుంది.

‘‘యిప్పుడు బాధ్యతను యెవరు కాదంటా వున్నారు?’’ అడిగాడు చిన్నాన్న.

సుబ్బరాయుడి తరపున తనే మాట్లాడింది వరమ్మ, ‘‘మల్లయ్యన్నా నీకన్నీ తెల్సు. మాయత్త కాలంజేసినాక ఐదేండ్లగా ఆయమ్మిని తల్లిలేదనే గమనమే లేకండా

మా కూతురి మాదిరి పెంచినాము. బాద్దెతంటే యింట్లో బెట్టుకోని అన్నం బెట్టేదొకటే గాదు గదా పెండ్లిజెయ్యాల, ఆపైన కష్టం, సుకం చూడాల. పెండ్లి చేసేదీ అంత సులబమా? కట్నం కింద ఆయమ్మికున్న బూమి వొద్దు, రొక్కం కావాలంటా వున్నారు. పోనీ అలివేలు రెండెకరాలు అమ్మెదామా అనుకున్నా గెట్టిగా తాలిబొట్టుకు, పెళ్లి కర్సులగ్గ్గాడా రాదు. యిప్పటికే పెద్దన్న యీయమ్మికి పెండ్లి చేసేటిగాలేడు అని వూర్లో బగిసినమైతాండాది. మా మర్దులు వూరొదిలి శాన్నాళ్లాయె. యిప్పుడు బూమి గూడా అమ్మేసుకోని, దుడ్డు చాతబట్టుకొని సైగ్గా యెళ్లిపోతాండారు. ఆయమ్మి బాద్దెత మా వొక్కరిమీదే పడతా వుందిగదా," అంది.

"యిప్పుడు చిన్నరైతులందరి పరిస్థితీ అట్లే వుంది వరమ్మా," అని, సుబ్బ రాయుడి తమ్ముళ్లనుద్దేశించి, "మీ బూములమ్మినారుగదా, ఆయమ్మి పెళ్లి ఖర్చుల కన్నా కొంత ఆమె పేర్తో బ్యాంకులో వెయ్యండి," అన్నాడు చిన్నాన్న.

"పెండ్లాం పిల్లల్తో సహా మా అత్తగారింట్లో పడి తింటా వుండాను. యిప్పటికైనా బగిసినం లేకుండా బతకాలగదా. యీడ నేనమ్మిన భూమికి ఆడ సగానికి సగం అర్దెకరా రావడంలేదు. ఆ దుడ్డుతో మా బామ్మర్ది యెరువులంగడి పెడ్దామంటా వున్నాడు. అది సరిపోక పైన వడ్డీకి తేవాల్సినట్టుగా వుండాది. ఆ టైమొచ్చినప్పుడు చెల్లెలికి నా శక్తికొద్దికి సాయంజెయ్యకుండా వుంటానా. అదేం మాట మల్లన్నా," బాధ పడుతూ తన ప్రస్తుత నిస్సహాయతను తెలియచెప్పాడు నాగయ్య.

మోహన్ వైపు చూశాడు చిన్నాన్న.

"రిజర్వాయర్ వొచ్చినప్పట్నుంచి మఠం యిప్పుడు పెద్ద టౌనయిపోయ్యి స్తలాల రేట్లు, యిండ్ల బాడిగలు వాటిష్టంగా పెరిగిపోయినాయి. యిక్కడ బూమమ్మిన డబ్బుతో రెండు రూముల షెడ్డొచ్చేదే గగనంగా వుంది. అదన్నా వుంటే బాడిగకర్చన్నా కల్సొస్తుందని మా ఆశ. ఆయమ్మి పెండ్లి టైముకు యెంతో కొంత యివ్వకుండా వుంటామా," అని తలొంచుకున్నాడు మోహన్.

వరమ్మ వదలిపెట్టలేదు. "యీడున్న బూములమీద ఆదారపడకుండా యిప్పటికే మీరు సంసారాలు చేస్తానే వున్నారుగదా. మీ బూములమ్ముకున్న దుడ్లేగాక యీ అలివేలు రెండెకరాలుగూడా మీకే వస్తాయి. వుద్యోగాలు, యాపారాలు జేసేటోల్లకే దుడ్డు చేతుల్లో ఆడతాది. యీయమ్మి మీకూ చెల్లెలేగదా," అని కొంగుతో కళ్లు తుడుచుకుంది.ఈ సంభాషణ మరికొంతసేపు నడిచింది, పరిస్థితిలో మార్పులేదు.

చిన్నాన్న కలగజేసుకుని, "మీరు పెండ్లి సమయానికి యెట్లైనా సహాయం చేస్తామని మాట యిస్తా వున్నారు. మంచిదే. అదొక్కటే సరిపోదుగదా? అలివేలుకు మంచి సమ్మంధం జూసి పెండ్లిజేసే బాధ్యతగూడా మీమీదుందిగదా?" అన్నాడు తమ్ముళ్లతో.

వరమ్మ వెంటనే అందుకుంది. "అందుకే మల్లయ్యా యిప్పుణ్ణుంచి ఆయమ్మి బాద్దెత మిగిలిన యిద్దురన్నల్లో యెవురో వొకరు తీసుకోని పెండ్లి కుదిరేదాకా

దెగ్గిరపెట్టుకోమని అడగతావున్నాము. ఆయమ్మికిచ్చిన రెండెకరాలూ వోళ్లనే తీసుకోమను'' వరమ్మ మాటల్లో తమ కష్టం కంటే వాళ్లు బాధ్యత తీసుకోవడంలేదన్న ఉక్రోషమే ఎక్కువగా కనబడింది.

''నావల్ల యేడైతాదయ్యా, యిల్లటం పోయినోణ్ణి, నేనే ఆడ అత్తగారింట్లో ఆపని యీపనీ జేస్తా లోకువగా వుండాను. యింగ చెల్లెల్ని యాడ బెట్టుకునేది. ఆడ దానికేమన్నా మర్యాద వుంటాదా? 'బజంత్రీవోడికే దూరే సందులేదంటే మెడకొక డోలు,' అన్నె సామెతగా వుండాది. మమ్మల్ని తప్పుగా అనుకోవద్దు'' మొహం చిన్నగ చేసుకున్నాడు నాగయ్య.

''లోకువ జేసేదేముండాది, అల్లుడని నెత్తిమీద పెట్టుకోనుండారు. చేసేది సేద్యప్పనులే గదా, హీనప్పనులెట్టౌతాయి? మా వొదినే యెప్పుడన్నా వొకసారి గొణుగు తాది. రమ్మనీ, నాలుగురోజులుండిపోమని అలివేలును అడగతానే వుండాము,'' అడగకపోయినా నాగయ్య భార్య సంజాయిషి యిచ్చుకుంది.

''అలివేలును నీదగ్గర పెట్టుకోవచ్చుగదా మోహనా, మఠం పెద్ద వూరు. అయమ్మి యేదన్నా చదువు నేర్చుకోవచ్చు. మంచి సంబంధాలు రావచ్చు,'' సూచించాడు చిన్నాన్న.

''వుండే ఆ రెండురూముల బాడుగకొంప మేం నలుగురుండేదానికే యిరుగ్గా వుంది. ఆడకూతురు యిబ్బందిపడతాదనే తప్ప, వొచ్చి యెన్నాళ్లున్నా సంతోషమే,'' ఎటూ చెప్పలేనట్టుగా చెప్పాడు మోహన్.

అలివేలు అక్కడే వుందన్న మాటే మరచిపోయి ఎవరికి వాళ్లు తమ నిస్సహాయతను వెలిబుచ్చడం కొంతసేపు కొనసాగించారు. ఆ తర్వాత బరువైన నిశ్శబ్దం ఏర్పడింది.

అలివేలు మబ్బులు కమ్ముకున్న మొహంతో భారంగా ఒకసారి పడమటి నల్లమల కొండలవైపు చూసి మళ్లీ తల దించుకుంది. ఒక కందిరీగ ఝుంకారం చేస్తూ వరండా అంతా తిరిగి ముందువైపున్న ఎండినపందిరి వెదురుబొంగులోకి దూరింది.

''యీ పంచాయితి యెంతసేపు చేసినా వొకటే. వోళ్లు చెప్పిందే చెప్తా వున్నారు. మల్లన్నా నువ్వే యేదోవొకటి ఫైసల్ జెయ్యి. మేం దానికి కట్టుబడి వుంటాం. అట్లా అనుకోనే నీదగ్గిరికొచ్చినాము. లేదంటే ఆ బరువేదో పెద్దోణ్ణి నేనే మోస్తాను. యెట్టన్నా గానీ,'' తలెత్తి చెప్పి మళ్లీ యథాస్థితిలో కెళ్లాడు సుబ్బరాయుడు.

హాల్లో ఏదో పనిచేసుకుంటున్న పిన్ని విసురుగా వసారాలోకి వొచ్చి, ''ఉమ్మడి ఆస్తి పంచుకున్నరోజే మనుషులుగూడా పంపకమైపోతారని అనేవాడు మా తాత. అయితే ముగ్గురన్నదమ్ములకూ వున్న వొక్కగానొక్క చెల్లెలు బరువైందా సుబ్బ రాయుడూ. యెంత కరువైతే మాత్రం ఆడమనిషి మనిషిగాకుండా వస్తువైపోతుందా. వొకరి మీద వొకరు తోసేసుకుంటారా. పెండ్లికి ముందే అప్పగింతలు పెట్టేస్తారా. అలివేలును నా చెల్లెలే అనుకుంటాను, మా యింట్లోనే పెట్టుకుంటాను, మంచి

సమ్మందం చూసి పెళ్లి చేస్తాను, మీరెవరూ ఆమెకోసం కొట్లాడుకోనవసరంలేదు, నువ్వు లోపలికి రా అలివేలూ,'' అంది ఆవేశంగా. ఆమెకు బయటి మాటలన్నీ వినపడి నట్టున్నాయి.

“నువ్వుండు సావిత్రీ. వాళ్లు రైతులు. వాళ్లకు చెల్లెలంటే అభిమానం లేక కాదు. మనకంటే యెక్కువ. యీరోజు చిన్నరైతులందరికీ యిదే పరిస్థితి. వొక్కోసారి బతుకులో లెక్కాచారం పోయి భయమో, బాధో నడిపిస్తుంది. నేను మాట్లాడతా వున్నా గదా. నువ్వు లోపలికి పో,'' గట్టిగా పిన్నితో చెప్పాడు చిన్నాన్న.

పిన్ని లోపలికిపోకుండా నాదగ్గరికొచ్చి మంచం పట్టెమీద కూచుంది.

“మీరెవ్వరూ యేమీ మాట్లాడొద్దు, అలివేలు యెట్లా చెబితే అట్లా చేద్దాం,'' అని చిన్నాన్న అలివేలుపక్క తిరిగి, “నువ్వు చెప్పు అలివేలు, యెవరి దగ్గర వుంటావు. నువ్వెవరి దగ్గరుండాలనుకుంటే వాళ్ల దగ్గరుండొచ్చు. మిగతా విషయాలు నాకొదిలి పెట్టు. మీ పెద్దన్న, నడిపన్న లేక చిన్నన్న వీళ్లలో యెవరి దగ్గిరుంటావు. నీ యిష్టం చెప్పు,'' అని అనునయంగా అడిగాడు.

ఎక్కడో తప్పుచేసి వచ్చినవాళ్లలాగా అందరూ పాలిపోయిన మొహాలతో తలలు దించుకున్నారు. అలివేలు మాటకోసం ఎదురుచూస్తున్నారు. అలివేలు హఠాత్తుగా ప్రపంచంలో ఎవరికీ చెందక ఒంటరిదైపోయినట్టు అనిపించి నా మనసంతా వెలితితో నిండిపోయింది.

ఒక పక్షి రెక్కలు విదుల్చుకుంటూ ఇంటిపక్కనున్న మామిడిచెట్టు నుంచి ఎదురుగా వున్న వేపచెట్టు మీదికి వెళ్లి వాలింది. ఊరిచివర యెవరో తల్లి ఎక్కడో దూరంగా వున్న తన పిల్లకోసం పెద్దగా అరిచి పిలుస్తున్న కేక వినపడింది.

అంతవరకు మోకాళ్లమీద తల పెట్టుకున్న అలివేలు వొక్కసారిగా తలెత్తి ఉప్పెనగా ఏడ్చింది. అలివేలే దుఃఖమైపోయినట్టుగా ఏడ్చింది. కళ్లనుంచి ధారగా నీళ్లు కారాయి. వెక్కివెక్కి ఏడ్చింది. ఒక్కసారిగా లేచి ఏడుస్తూనే ఎవరివైపూ చూడకుండా నేరుగా మెట్లుదిగి వీధిలో నడుస్తూ వెళ్లిపోయింది.

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*22 నవంబర్ 2020*

*



డా॥ కె.వి. రమణరావు 22 నవంబర్ 1957న జన్మించారు. మొదటి కథ పరుగు పందెం 24 మే 2006 నవ్య వీక్లీలో ప్రచురితమైంది. దాదాపు అరవై కథలు రాశారు. పుట్టిల్లు కథాసంపుటి ప్రచురించారు. కొన్ని వ్యాసాలు, కథా సమీక్షలు రాశారు. అధ్యాపక వృత్తిలో పదవీ విరమణ చేశారు.

**చిరునామా:** ***3-13-15/5, 1బి, మధురానగర్, రామంతపూర్, హైదరాబాద్-500013***

***ఫోన్: 98491 23265*** **kvrr1947@gmail.com**